# మూగపోయిన మనసు

(కథానిక)

అంత అందమైన మహల్లోనూ చిట్ట చీకటి ఒక్కటే చిరు నృత్యం చేస్తోంది. ఏ శబ్దమూ రాత్రులు వినిపించదు. పగలు ఏ ప్రాణీ సడిచేయదు. అంతా అంధకారమయం. కాని ఒక పెద్ద గదిలో గదికి మధ్యగా పెద్ద మంచం, మంచం పక్కగా ఒక పెద్ద గాజు బల్ల. దానిమీద చిన్న సన్నని హీనకాంతి కొద్దిగా పడుతోంది. ఆ సన్న కాంతిలో ఎవరిదో చిత్రం మసకగా, మురికిగా అగుపిస్తోంది.

మంచంమీద ఎవరో పడుకొనివున్నారు వెల్లకిలా. శ్వాసగూడ ఆడనంత నిశ్శబ్దంగా వుంది గాలి. బరువుగా ఒకచేయి ఆ గాజు బల్ల మీద పడింది. ఆ చేయి ఫొటోని తాకింది. పైకి మెల్లగా తీసింది. ఆ చిత్రాన్ని హృదయానికి హత్తుకొంది. వెంటనే మూగవ్యథ పైకుబికింది.

మంచంమీద పడుకొన్న వ్యక్తి పురుషుడు. ఒక దీర్ఘ రోగిలా అగుపిస్తాడు. ఎప్పుడూ నిలువు చూపుతో ఆకాశం కేసో, ఆ పెద్ద కిటికీల్లోంచి దూరాన కనిపించే శిథిల గోడల కేసో చూస్తూ ఆ చిత్రాన్ని హృదయానికి హత్తుకుంటూ కన్నీరు విడుస్తుంటాడు.

ఆ మహలు పెద్ద కిటికీలనించి దూరాన అగుపించే శిథిలాలు ఒకానొకప్పుడు పెద్ద యంత్రశాల అంటారు. స్వశక్తితో, స్వబుద్ధితో భూసారాన్ని పిండి పండించినా, ఆ ప్రాణంలేని యంత్రాల సాయం లేనిదే మింగలేని మానవులకి, ప్రాణాన్నిచ్చి పోషించే యంత్రశాలది. బలమైన గాలి గోడలు శిథిలాలయి నిలిచిపోయాయి.

నిశ్శబ్దంలో నిట్టూర్పు విడచిన ఆ పురుషుడు మంచంమీదే పడివున్నాడు. అతడు మామూలు మానవుడే. దిగ్మండలంమీద ఉదయిస్తున్న నక్షత్రాలు నడి ఆకాశాన్నందుకొని వెనక్కి పడిపోతున్నాయి.

తెల తెలవారింది. పెద్దపెద్ద గాజు కిటికీల్లోంచి అరుణ కిరణాలు చెంగుచెంగున దూకుతున్నాయి నిశ్శబ్దంగావున్న ఆ గదిలోనికి.

“బాబుగారు, శోభనమ్మగారు రొచ్చారు” అన్నాడొక సేవకుడు వచ్చి.

మత్తుగా మంచంమీద వున్న పురుషుడు లోపలికి తీసుకరమ్మని తలూపేడు. నౌఖరు వెళ్ళిపోయాడు. శోభన వచ్చింది.

అతను ఆమెను చూసి సంతోషించలేదు, మంచంమీదినించి ఎగిరి గంతువేయలేదు, ఆహ్వానించలేదు, తిరిగి చూడనన్నా లేదు- కాని అది తిరస్కృతి కాదు. ఎత్తుగావున్న మహలుపై కప్పుని చూస్తున్నాడు. అతని రెండు చేతులు యింకా ఛాతీమీదే వున్నాయ్.

“ఇంకా మత్తే, సేం?” అంది ఆమె పక్క సోఫాలో కూచుంటూ.

“టీ తీసుకొన్నావా శోభనా?” అలాగే వుండి అన్నాడు.

“లేదు... నువ్వు ఎప్పుడూ బద్ధకంగా, ఏదో గొప్ప ఆర్టిస్టులాగు ఆలోచిస్తుంటావు... లే” అంటూ ఆమె, అతను గుండెలవరకూ కప్పుకొన్న పట్టు శాల్వని లాగేసింది. అతని విశాల వక్షంమీద రెండు చేతులూ ఒకదానిమీద ఒకటి నిశ్చలంగా వున్నాయ్. వాటికింద ఒక కాయితం!

“ఏమిటది?”-చేతులు విడిపించి చిత్రాన్ని తీసి చూసింది శోభన.

అతను ఇంకా కదలలేదు. శోభన కేసి చూడనన్నా లేదు. అదే నిలువు చూపు.

“ఎవరిదిది?” అర్థంగాక, నలిగి మాసిన ఒక స్త్రీ ఫొటోని చూసి ప్రశ్నించింది ‘సేం’ని.

“ఒక స్త్రీది.”

“ఎవరామె?”

“ఒక హంతకి.”

యన్. ఆర్. నంది

శోభన బెదిరి ఒక అడుగు వెనక్కి వేసింది. అతని కేసి భయంగా చూస్తోంది.

"కాని అమాయకురాలు."

శోభన కనుబొమ్మలు కదిలాయి.

"చంపబడింది."

మళ్ళా భయంగా సేం కేసి చూసింది. చిత్రాన్ని మరోకసారి చూసింది.

"అమాయకురాలు కాబట్టే, చిత్రవధ గావింపబడింది. ప్రేమమూర్తి గాబట్టే ఒక చాతగాని భర్తని జీవితమంతా ఏడుస్తూ వుండమని స్వర్గానికి వెళ్ళిపోయింది" చలించకండా, శవంలా పడుకొని పెదవులు కదుపుతున్నాడు. మహాలు గదులన్నీ సాక్ష్యమిస్తున్నట్టు ప్రతిధ్వనిస్తున్నాయ్.

"ఆమె ఎవరు?"అర్థంగాక శోభన మళ్ళా అడిగింది.

"వివరాలు అడగకు శోభనా. ఒక స్త్రీ, అంతే. స్త్రీగాబట్టే ఒకరికి బానిసయింది. ఆమె ధనవంతురాలు కాదు. అందుకు ఒక సామాన్యుని వివాహమాడింది."

"ఎవరాయన?"

"ఒకడు. భార్యని ప్రేమించడం తెలీని ఒక మూర్ఖుడు. భార్యకంటే వాడికి డబ్బు ముఖ్యం. డబ్బుకోసం ప్రేమని నీచంచేశాడు."

"శోభన మెల్లగా సోఫాలో కూచొంది.

"టీ తీసుకో శోభన."

"వొద్దు చెప్పు."

"వినోదంకోసం కడుపు మాడ్చుకొంటావా?"

"నువు చెప్పేది వినోదమయినా, కాదు— నువ్వలా అనుకొన్నా ఒక అభాగ్యురాలి జీవితాన్ని చెబుతున్నావు."

"రామూ–" అని కేకేశాడు. నౌఖరు వచ్చాడు. "టీ తీసుకురా." నౌఖరు వెళ్ళిపోయాడు.

"చెప్పు."

అతని దృష్టి కొత్త పక్కకు తిరిగింది. కాని శోభన దృష్టిని ఎదుర్కోలేదు.

"చెబితే వింటావు. కాని స్వర్గాన్ని నీ కళ్ళముందు సృష్టించేటంత భావనా శక్తి నాలో లేదు."

"నువ్వు చెప్పేది ఒక హంతకి –. కాదు– ఏమన్నావ్?"

అతను సన్నగా నవ్వాడు. నీరసించి ఎండిపోయిన పెదవులు బిగిసాయి.

"ఆమె కత్తితో ఎవరినీ చంపలేదు. ఒకరిచేత చంపబడి, ఆ హంతకుణ్ణి, ఆమె చనిపోయి, వ్యథలో ముంచివేసింది. అందుకే ఆ మాట అన్నాను."

"ఎందుకు చంపబడింది?"

"సుకుమార హృదయంలో సృష్టించబడ్డ దౌర్బల్యంవల్ల. మానవ నైజంమీద నీకు నమ్మకముందా శోభనా?"

"ఉంది. ప్రపంచంలో ఒక్కరిమీద"

"ఎవరు వారు?"

"సామ్యూల్."

"కాదు. సామ్యూల్ కాదు. స్వామి... స్వామికాదు క్రూరుడు. వాడి నెలానమ్మావ్? పేరు మార్చుకొని మతం మార్చుకొన్నందుకా"

"కాదు. ఎందుకో చెప్పలేను."

"కారణం లేకండా?"

"కారణం లేకండా అనకు. వ్యక్తం చేయలేని భావాలతో అను... ఈ భావాలు ఎవరికుంటాయి సాం?"

"సృష్టి అంతకీ."

"కాదు మానవుల్లో స్త్రీ భావాలు వ్యక్తం చేయబడకండా దాగి, నక్కి ఎవరికోసం విజృంభిస్తుంటవి?"

స్వామి మాటాడలేదు. శోభన ప్రత్యుత్తరం కోసం చూస్తోంది. ఆ పరవశత్వంలో ఆమె చేతివేళ్లు పట్లు తప్పాయి. చేతిలోని చిత్రం కిందపడింది. శోభన అప్రయత్నంగా ఆ చిత్రంకేసి చూసి, దడిసింది. ఆమె గుండె ఎందుకో దడదడ మంది. గజగజ వొణికిపోయింది. భయంగా మళ్ళా ఆ చిత్రాన్ని ఎత్తింది. స్వామి ఇంతసేపు మాటాడినా ఎవరితోనో మాటాడినట్టు మాటాడాడు.

"సాం, ఈ ఫొటో నీకెలా వొచ్చింది?" అంది మెల్లగా శోభన.

"నాది నా దగ్గరుండకపోతే మరెక్కడుంటుంది శోభనా?"

"అయితే ఈమె ఎవరో తెలుసా నీకు?"

"తెలుసును. బాగా తెలుసు."

"నే నెవరో తెలుసా నీకు?"

"తెలుసు. నువ్వు ఎవరని ప్రశ్నించకండా నే నేను జవాబిస్తాను, నువ్వొక స్త్రీవని"

కంగ్ మంది గోడమీది గడియారం. శోభన అప్రయత్నంగా ఆ గడియారంకేసి చూసింది. లోలకంలేని గడియారం. అహఁ. లోలకం కని పించని గడియారం. చిన్నగాలి కిటికీ సందు ల్లోంచి చిన్నగా సిల్కు తెరలని తోసింది. శోభన అక్కడ వుండలేకపోయింది. గబగబా వెళ్ళి ఆ గాజు తలుపులని తోసింది. గాలులు మెల్లగా, చల్లగా లోనికి ప్రవేశించాయి. అంత ఆనందంగా గంతులేసే అనిలకుమారులను ఎందుకు స్వామి తలుపులేసి బాధిస్తున్నాడు?

"కిటికీ ఎందుకు తెరిచావు శోభనా?" అన్నాడు సాం. ఆ గాలి రుచి, తాకిడి అంతా అతనికి సుపరిచితాలే. ఆ కిటికీలోంచే శిథిల భవనపు చిల్లపెంకులు దూరాన అగుపిస్తుంటవి. ప్రొద్దుటలేచి ఆ శిథిలాలని చూడడు స్వామి. కాని సూర్యుడు వార్ధక్యంలో కుంగిపోయే ప్పుడు, మెల్లగా నిశబ్దంగా సడలింపబడ్డ వీణా తంత్రుల శబ్దంలా ఆ శిథిలాలని చూస్తుంటాడు. అసలు మధ్యాహ్నంవరకూ అక్కడనించి లేవడు.

"కిటికీలోంచి శిథిలాలని చూడడానికా?"

శోభన దగ్గరగా వచ్చింది. చేతిలోని చిత్రాన్ని చూసి మళ్ళా ఆకథ వినాలనుకొంది.

"అది పెద్ద ఫ్యాక్టరీ తెలుసా కొంతకాలం క్రితం?" అన్నాడు.

"అవును"

"నీ కెలా తెలుసు?"

"నన్ను రక్షించి పెంచిన డాక్టరుగారు చెప్పేవారు."

"ఆ డాక్టరు నీ కేమవుతారు?"

"ఏమీ అవరు. నన్ను బలికించి ప్రాణం పోశారు."

"కృతజ్ఞత?"

"అన్నయ్యా అని పిలుస్తుంటాను."

"నీకు తలిదండ్రులు లేరూ?"

"ఉన్నారు స్వర్గంలో..."

"నీకు...నీకు..."

శోభన కంగారుపడింది. "ఈ చిత్రం ఎవ రిదో పూర్తిచేయలేదేం?

"నీకంత పట్టుదల ఎందుకు?"

"నీ వ్యథకీ ఈ చిత్రానికీ ఏదో సంబంధ ముండాలి"

సాం సన్నగా, బాధగా నవ్వాడు. "ఉంది శోభనా—చాలవుంది"

"అయితే ఆమె ఎలా చచ్చిపోయిందో గూడ నీకు తెలిసేవుండాలి"

"తెలుసు-కాని చెప్పలేను"

"ఏం? ఎందుకు?"

"తెలుసుకోవొద్దు శోభనా. ఇంతవరకూ నువ్వు ఇష్టపడి ఒక అన్నలా చూసుకొంటున్న నామీద నీకు విరక్తి పుడుతుంది."

"జాగీ-" అని పిచ్చికేకవేసి "అ-న్న-లా-" అని కింద పడిపోయింది.

"జాగీ!" - ఏమిటా శబ్దం? ఎప్పుడో, ఎక్కడో ఆ శబ్దాన్ని ఎవరి నోటనింనో వినే వాడు. మైకంపోయింది. స్వామిగభుక్కునలేచి పడిపోయినశోభను పట్టుకొన్నాడు.

"అన్నలా?" అంటూనే వుంది మెల్లగా కింద పడిపోయిన శోభన. ఆకేకకి మహాలంతా జడిసి బెదరి, పిచ్చికేకల నుచ్చరించింది. నౌక ర్లందరూ పరుగున వొచ్చేశారు. వొణుకుతూ అన్ని ద్వారాలనించి ఆతృతగా చూస్తున్నారు.

టీ కలుపుకోడానికి తెచ్చిన వేడినీరు చల్ల బడిపోయింది. అది యిప్పుడు పనికొచ్చింది. కొంత నీరు ముఖంమీద చల్లాడు. శోభన కొంత కళ్ళు తెరచింది.

"మీరంతా వెళ్ళిపోండి" అన్నాడు స్వామి అందరు నౌఖర్లతో. నిశ్శబ్దంగా నడచిపోయా రందరూ.

"శోభనా" అన్నాడు మెల్లగా ఆమె సన్నని కంఠాన్ని నిమురుతూ.

"జాగీ...ఏమన్నావ్...నిన్ను అన్న లాగా?...అందుకేనా...నిన్ను ప్రేమించేది? నేను నీకు చెల్లెలినా?..."

ఈ 'జాగి' మాట సాంకి అర్థం గావటం లేదు. ఎప్పుడో విన్నాడు. బాగా పరిచయ మయినమాటే. ఎక్కడ? శోభనడిగితే? అతని కంగారు 'జాగి' శబ్దంగురించే కాని, ఆమె

వేదన ఏమిటో అతనికి తెలియలేదు. ఆమెను హృదయపూర్వకంగా చెల్లెలిలా ప్రేమిస్తున్నా- అతని కాహూట మీదే పట్టుదల, కలవరం!

"శోభనా—జాగీ ఏమిటి? ఎందు కలా అన్నావ్?"

శోభన మెల్లగా తేరుకొంటోంది. ఎదురుగుండావున్న ప్రాణి, తను హృదయపూర్వకంగా మోహప్రేమల మిశ్రమంలో కని పెడుతున్న సాం! మరి తనకి తెలీకండా ఈ 'జాగీ' అనే మాట ఎలా వొచ్చింది? భయపడింది. గజగజలాడింది.

"ఏమీలేదు సాం. జాగీ మా సర్వెంట్. దాన్ని నే నెంతో ప్రేమిస్తాను. ఆమె నన్ను తల్లిగా వాత్సల్యంతో చూస్తూంటుంది"

"అదే నీ శబ్దం? కాని 'జాగి' శబ్దం నాకు బాగా పరిచయం. ఆమెను ఒకసారి చూపించవు శోభనా?" అని ఆమె చేతులు పటుకొన్నాడు జతిమాలుతున్నట్టు.

శోభన బెదరింది. "లేదు సాం చచ్చిపోయింది."

"చచ్చిపోయిందా? ఎవరు చంపేశారు?" పిచ్చిగా అరిచాడు.

"ఎవరూ చంపలేదు సాం. మేడమీదించి కాలుజారి కిందపడి చచ్చిపోయింది"

"శోభనా!" హాలంతా అగ్నిపర్వతాలు బద్దలైనట్టు హిమాలయాలు ఢీకొన్నట్టు ప్రతిధ్వనించింది. "ఆమె నా జానకి. ఈ ఫొటో ఆమెదే. మేడమీదించి కాలుజారి ఆమె పడిపోలేదు. నేనే తోసేశాను. నేనే ఆమెను చంపేశాను డబ్బుమీద పిచ్చితో. శోభనా ఇక నేను బతకను" అని కిందపడిపోయాడు.

శోభన వొణికిపోయింది. అతని మనసు మార్చడమెలా? దగ్గరకువచ్చి అంత పెద్ద శరీరాన్ని మంచంమీదికి చేర్చింది.

"సాం...జాగి" ఆమె కళ్ళనించి నీరు కిందవున్న పట్టుపరుపుల్లోకి ఇంకిపోతోంది. తడిసిపోతున్న పరుపుమీద స్వామి నీరసించిపోతున్నాడు.

"నన్ను 'జాగీ' అని పిలచేది. నేను ఈ వెండి నాణాలకి, కాయితం ముద్రలకి వశుడనై, నా 'జాగి'ని చంపి, నన్ను జాగిగా పిలిపించుకోకండా చేసుకొన్నాను" అతనికి ఎగశ్వాస వొచ్చేస్తోంది. బరువుగా గాలి పీలుస్తున్నాడు.

"నువ్వు నా చెల్లిలివి కాదు, నా జాగి నిన్ను కూతురుగా పెంచింది. అందువల్ల నువ్వు నాకూ కూతురువే ... రామ్మా చచ్చిపోయే ముందు నన్నొక్కసారి ముద్దుపెట్టుకో" హీనంగా అన్నాడు.

శోభన గుండెలు కదలిపోయాయి. కూతురుగా!? ప్రియునిలా ప్రేమిస్తున్న 'సాం'ని తండ్రిగా పిలవాలా? అలా అంతరంగంనించి వుచ్చరించాలా? ఆమెకళ్ళనించి నీరు-నిస్పృహ నిరాశలతో కలసి ప్రవహిస్తున్నాయి.

"ఇంకెంతో కాలం లేదమ్మా. రా ముద్దు పెట్టుకో" అన్నాడు. తప్పింది కాదు. ఆమె ముద్దు పెట్టుకోబోయింది. అతని చల్లని చెక్కిలిమీద సుడులు తిరుగుతున్న చల్లగాలులు శోభన పెదవులకి తగలగానే, ఆమె నవనాడులు జింమన్నాయి. ఏదో స్వర్గాన విహరిస్తున్నట్టను కొని అతను కూతురుగా ముద్దు పెట్టుకోమన్నాడే! అని గభుక్కున వెనక్కి తగ్గింది.

"—నాన్న కోరిన ఈ చివరి కోర్కెను తీర్చలేవామ్మా?"

ఆమె గుండెల్లో కసాయికత్తి దూరి ఊర్ధ్వ, అధఃరక్తనాళాలని కలపి, కలతపెట్టి చీల్చి చెండాడుతున్నట్టు బాధపడింది. ఆమెరక్తంలో, మాంసంలో, మేధస్సులో, హృదయంలో, మనసులో, సర్వంలో పాతుకొని, ప్రవహించి జీర్ణించుకపోయిన అతనిమీద భర్తృప్రేమ ఒక్కసారిగా పితృప్రేమగా మారడం ఎలా సాధ్యం?

"అమ్మా! నాన్న పాపాత్ముడు. అతన్ని ముద్దు పెట్టుకోకండా, నిరాకరించి నరకానికి పంపకు" అంటున్నాడు.

నరకం, స్వర్గం. తన ప్రేమని తిరస్కరించి పోయే సాంకి, తను ముద్దు పెట్టుకొన్నా నరకమే ప్రాప్తిస్తుంది. మగాడైవుండిగూడ ఒక స్త్రీ ప్రేమను 'కూతురు ప్రేమగా,' 'రక్తస్పర్శ'గా అనుకుంటే అతనిలో శృంగారమే నశించివుండాలి. అవును నశించిపోయింది జాగి

చనిపోయినతర్వాత. పోనీ తనే 'జాగి' అని అబద్ధమాడితే? కాదు అతని మనస్సింకా బాధ పడుతుంది. అమాంతంగా అతనిమీదపడి చెక్కిలి ముద్దు పెట్టుకొంది. సాం కూతురులా తల నిమిరాడు. శోభన తన అవ్యక్త వ్యథని ప్రియుని ముందు కడసారిగా వెళ్ళబుచ్చేట్టు, అతని విశాలవక్షంమీద భోరుమంది.

స్వామి తృప్తిగా ఆమె తల నిమిరాడు. ఒక నిట్టూర్పు విడచాడు.

"శోభనా, అమ్మా ... అక్కడ ... అలమారా వుంది...అది... తెరమ్మా ... తాళాలివిగో" అని తాళాలిచ్చాడు. శోభన, స్వామి గుండెలని వొదలలేకపోయింది. చివరికి లేచి తాళాలు తీసుకొంది. ఆమె ఒడిలోని 'చిత్తరువు' కింద పడిపోయింది. ఆమె అది గమనించలేదు. ఎడంకాలు ఆ చిత్రంమీద పడి, ఆ కౌస్తముఖం నల్లగా అయిపోయింది.

అలమారా తెరచింది, అందులో ఏమీ లేదు.

"ఏముందమ్మా దాన్లో?" అన్నాడు!

"ఏమీ లేదు."

"సరిగా చూడమ్మా."

అంతా సరిగానే వెదకింది. చెయి పెట్టి తడుముతోంది. హాలంతా సూర్యకిరణాలతో నిండిపోయినా ఆ అలమారాలో మాత్రం చిట్టచీకటి తాండవిస్తున్నట్టు భ్రమిస్తోంది శోభన. ఆ వెదకుతున్న చేతికేదో చల్లగా తగిలింది. చెయ్యిని గభుక్కున లాగింది శోభన. చెయ్యి బయటికి వొచ్చేసరికి వేళ్లు తెగి రక్తం కారుతోంది. చీరకొంగుతో వుబికిపోయే రక్తాన్ని ఆపబోయింది.

"ఏముందమ్మా?" సాం మాటలు నీరసంగా, దృఢంగా వినబడుతున్నాయి.

మళ్ళా శోభన కళ్లు పెద్దవిచేసి లోపలికి చూసింది. సగం విరిగిన గాజుసీసా మూతి!

"విరిగిపోయిన సీసా" అంది మెల్లగా, చేతినించి స్రవిస్తున్న రక్తాన్ని ఆపుకొంటూ.

"అదే! బద్దలైపోయింది- కాదు నేనే విరకొట్టాను. నా చేతులతో నేనే విరకొట్టాను. నా హృదయం గూడ అలాగే విరిగి, కత్తిఅంచులా దారుగా ముట్టుకొంటే తెగిపోయేట్టు మొనదేరింది. అది ఏమీ వాసన వేయడం లేదూ?"

శోభన ఆ సీసాముక్కని తీసి వాసన చూసింది- 'లేదు' జవాబు పెదవుల్లో గింజుకుంది.

"అవును, గాలికి ఆరిపోయింది. వాతావరణానికి మారిపోయింది. కాని అది ఒకరి ప్రాణాన్ని బలిగొంది."

శోభన చేతివేళ్లు కంపించాయి. విరిగిన సీసాముక్క కిందపడి, రెండు ముక్కలే అయింది.

"ఏమ్మా, కింద పడిపోయిందా? అవును, దాని స్నేహితుడు వెళ్ళిపోతోంటే అదెందుకుండి? అది ఏ రంగులో వుందమ్మా?"

శోభన మోకాళ్లమీద కూచునుంది. ఆమె కళ్ళనించి ఎందుకో నీరు వెల్లువలవుతోంది. ఆమె అ ముక్కలని ఎత్తి చూసింది- "ఎర్రగా వుంది సీసారంగు!"

"అవును. ఎరుపే దాని సహజగుణం. దాన్ని పట్టేవాళ్లంతా ఆ ఎరుపునే పర్యవసానంగా చూస్తారు."

శోభన కంటినించి కారుతున్న కన్నీరు, ముక్కలైన ఎర్రటి సీసామీదపడి, పైరంగు కరగి సీసా మెల్లగా సహజత్వాన్ని సంపాయించుకొంటోంది. రెండు కన్నీటి బిందువులు లోపలివేపు గూడ పడ్డాయి. ఆసీసాలో ఇంకి, ఆరిపోయిన వాసనంతా గప్పుమంది. శోభన ఆ వాసనని పసికట్టింది. కడుపులో తిప్పేస్తోంది. శ్వాస బిగించి, నాసికారంధ్రాల కొనలనించి ఆ దుర్వాసనని నెట్టేయాలని వృథా ప్రయత్నాలు చేస్తోంది.

"ఎంత దుర్వాసనగా వుందో అని ఆశ్చర్యపోతూ, అసహ్యపడుతున్నావు కదమ్మా. ఆ దుర్వాసనని భరించిగూడ మనసు దుర్బలమై, ఆ కంపునీటినే తాగుతుంది. అది తాగుతూ, తాగుతూ మైమరచిపోతాడు. అతను స్వర్గాన విహరిస్తుంటే, మిగతా వారంతా అది తాగి నరకాన్ని అనుభవిస్తున్నాడనుకొంటారు. అలమారా మూసి ఇలా రామ్మా."

శోభన అలమారా మూసి స్వామిదగ్గరకు వచ్చింది. ఆమె పిచ్చిదానిలా అతని మాటలని,

చర్యలని వింటూ, కనిపెడుతూంది, కాని ఒకటేబాధ ఆమెని తీవ్రంగా వేధిస్తోంది.

"వొచ్చావు కదమ్మా- ఆఇనుపపెట్టె తెరు. దాన్లో ఒక వస్తువుంటుంది. అది ఏమిటో చెప్పు."

శోభన వెళ్ళి పక్కనున్న ఇనప్పెట్టె తెరచింది. లోపలి అరలో ఏదో చిన్న వస్తువుంది. దాన్ని ఇటూ అటూ తిప్పిచూసింది.

"ఏమిటో తెలుసా అది?"

"తెలుసు. దొంగనోట్లు తయారుచేసే—" ఘర్జిస్తోంది.

"నీకెలా తెలుసమ్మా?"

శోభన నాలిక కరచుకొంది. అవును తనకెలా తెలుసు— అది దొంగనోట్లు తయారుచేసే యంత్రమని? ఇంతకముందు తనెప్పుడయినా అలాంటిదాన్ని చూసిందా? ఎందుకో కళ్లు భయంగా బెదిరాయి.

"బాగా కనిపెట్టావమ్మా! నిజాలు, ప్రతి అంతరంగంనించీ ఒకలాగే పలకబడతాయి. దాన్నే దైవత్వమంటూరు. నువ్వు తెలీకండా ఏదో అనేశావు. అదే నిజం అయింది."

శోభన అలానే ఆ వస్తువుకేసి చూస్తోంది.

"ప్రొద్దుట నేను ఆ కిటికీలోంచి ఆ కనిపించే ప్రపంచాన్ని చూడను. అందుకు నువ్వే జాగ్రత్తగా చూడు అక్కణ్ణించి ఏం కనిపిస్తుందో...ఎందుకో నీకన్నీ ఈవాళ చెప్పాలని బుద్ధిపుట్టింది. చెప్పేస్తున్నాను ... ఏముందమ్మా అక్కడ?"

"పడిపోయిన ఫ్యాక్టరీ."

"అవును, పడిపోయిన ఫ్యాక్టరీయే అది. దానిపేరు ఐదేళ్ళకితం 'స్వామి రైస్ మిల్.' దేశమంతలోనూ అంత పెద్ద ఫ్యాక్టరీలేదు తెలుసా? నీ చేతిలోని ఆ చిన్నయంత్రమే దాన్ని సృష్టించింది. సూక్ష్మాల్లోంచి అద్భుతాలు ఉద్భవిస్తాయి. కాని మానవులు ఒప్పుకోరు."

శోభన ఇంకా పిచ్చిగా ఆ చిన్న యంత్రం కేసే చూస్తోంది. ఏవీ ఆశ్చర్యం కనబరచడం లేదు.

"మనల్ని పరిపాలిస్తున్న ప్రభుత్వం ఆ సూత్రంతోనే ఈ కృత్రిమాన్ని సృష్టిస్తుంది. మనం రక్తాన్ని చమటగా తయారుచేస్తే ప్రతిఫలంగా ఆ కాయితంముక్క నిస్తారు. కాని మనమేవాటినిసృష్టిస్తే, మన మద్దతువల్లగద్దెక్కి పాలిస్తున్న పాలకులు మన్ని చిత్రవధచేసి చంపేస్తారు. కాని ఈ నాణాలవల్లే మానవులు బానిసలయిపోతూ పతనమయిపోతున్నారని వాళ్ళకి తెలీడంలేదు. వాళ్లు అదొంగని పట్టడానికి వ్యూహాలు పన్నుతూంటే, నాయినప్పెట్టెలోని కృత్రిమ కాయితాలన్నీ అగ్గిలో లీనమయ్యాయి."

శోభన కంటినించి కన్నీరు కారుతోంది. ఒకొక్కబొట్టూ ఆచిన్న యంత్రంమీద పడుతూ జారిపోతున్నాయి. ఈ మహాలుని సృష్టించింది గూడ యంత్రమే లాగుంది. అయితే తన ప్రేమికుడు ఒక దేశద్రోహి! కాదు ప్రేమకి ద్రోహాలు, నేరాలు ప్రతిబంధకాలు కావు.

"కోట్లని కళ్ల చూసిన ఒక మామూలుమానవుడు-ఇంతకు ముందెప్పుడూ ఒక వంద రూకలని చూడని బీద ఒక్కసారిగా కోటీశ్వరుడై విర్రవీగుతూ-ఆ కృత్రిమ కాయితాలన్నీ బుగ్గయిపోతే ఎంత పిచ్చివాడయిపోతాడో ఆలోచించుకో. ఆకృత్రిమాలు మామూలుగావుంటే, కఠిన శిలలు ఒకరూపాన్ని దాల్చి, వికృతాలు సుందరాకారాలుగా మారి, ఒక యంత్రాలగా మారి - మన స్వప్రయోజకత్వంతో పండించుకొంటున్న పంటని, దాని సాయంతో ఓ స్వరూపానికి తెచ్చుకొని, ఈ కక్కుర్తి పొట్టని నింపుకొంటూ బతకడానికి వీలవుతాయి. కాని అవి ఈ పంచభూతాల్లో ఒక దానికి ఆహుతయితే? చూడమ్మా, ఆ శిథిలాలు ఎండకి ఎండుతూ, వానకి తడుస్తూ ఏడుస్తూ ఎలావున్నాయో! ఈ కృత్రిమత్వాన్ని సృష్టించుకొన్నాం మనం- ఎవరం? మహా మేధావులమయిన నరులం. దాని కపట విజృంభణకి లొంగి లోభులమై ఇంకా, ఇంకా అంటూ, లక్షలు, కోట్లు గడించుకొంటూ, ఒకరినొకరు ఈర్ష్య, అసూయలతో నాశనం చేసుకొంటూ బతుకుతున్న మనం- "నవనాగరికులం"? ఆ నాణాల ప్రళయనృత్యాన్ని మనమేధావులింకా ఆపలేక గింజుకొంటున్నారు. మానవనైజం- మనసు, భౌతిక ఇంద్రియాలు సృష్టించిన ఈ భీకరత్వానికి, ఈ మాయకి లొంగి దుర్బలమయిపోతోంది - అయిపోయింది గూడ. మన

తరాలవారు, మన పిల్లలు, పిల్లల పిల్లలు ఆ దుర్బలత్వంతోనే పుడుతున్నారు. వాళ్ల రక్తాలు, నరాలు, మాంసం, ఎముకలు, అన్నీ ఆ కపటంతోనే నిర్మింపబడుతున్నాయి. నా పతనానికి నీ చేతిలోని ఆ చిన్న యంత్రం మూలం. దాని మూలకారణం మన మేధస్సు. నేను పిచ్చివాడనయిపోయాను. వొచ్చిన కృత్రిమాలు వొచ్చినట్టే అగ్గిలో బుగ్గయిపోగానే నా మనసుని, నాదే అనిగర్విస్తున్న నా హృదయాన్ని, నాలో వున్న నా స్వంత మనుసుని అదుపులో పెట్టుకోలేక, మళ్ళా ఈ మానవులు సృష్టించిన కుళ్ళు ద్రవాన్ని తాగి నా నరాలకి, మాంసానికి, హృదయానికి మెదడుకి చివరికి నాలోని దైవత్వానికి మత్తెం క్కించాను. రక్తమంతా ఆ ప్రేరేపణలోనే మత్తెక్కిపోయేది - మానవులు సృష్టించిన కపటం ఎంత శక్తివంతమైనదీ! చివరికి మానవుడుగా బతికించ గలుగుతున్న దైవత్వాన్ని గూడా చిత్రవధ చేయడంతో బోధపడుతుంది. కాని నరుడా సంగతిని గుర్తించలేడు, వాడూ వంచకుడు గాబట్టే!... నేను డబ్బుకి దాసుడను కాని - నా జానకికి ప్రేమగా నన్ను 'జాగీ' అని పిలచే ప్రేమమయి పలుకులకి దాసుడను కాలేక పోయేవాడిని. నన్ను మానవ మేధస్సు, పూర్తిగా చిత్రవధ చేసింది... ఆ కృత్రిమత్వం కలిగించే మత్తులో ఆ సాధ్విని చెప్పలేనమ్మా. ఊహించుకో - మానవ రక్తాలలోని రాక్షసత్వాన్ని చివరికి ఆ కృత్రిమ పానీయాన్ని మోసే ఆ సీసాతోనే నా జాగి తల బద్దలుకొట్టి మేడమీంచి తోసేశాను... నేను, మూర్ఖుణ్ణి, దుర్బలుణ్ణి."

"జాగీ" అంటూనే చేతిలోని వస్తువ కింద పడేసి శోభన స్వామి పక్కకి వొచ్చింది.

"ఏడుస్తున్నావామ్మా? ఆ శబ్దాన్ని కనించి అనొద్దు. నా జీవితాన్ని చెప్పేందు కాశబ్దమే నన్ను పురికొల్పింది. నా జాగి చేతుల్లో పెరిగిన దానవు కాబట్టే నీ దగ్గర నా హృదయాన్ని విప్పాను."

"కాదు జాగీ నీ జానకిని నేనే. నన్ను పెంచింది నీ జాగి కాదు; డాక్టర్ - నీ స్నేహితుడు" అతని ముఖాన్ని తడుముతూ ఏడుస్తోంది.

"కాదు శోభనా... నా జాగి వెంటనే అప్పుడే చచ్చిపోయింది."

శోభన అతని హృదయాన్ని మార్చాలని యింకా ప్రయత్నిస్తూనే వుంది. తన్ని కూతురుగా కాకండా ప్రేయసిగా ఒక్కసారి పిలుస్తే చాలు అని అనుకుంటోంది. కాని స్వామి మనసు పూర్తిగా విరిగిపోయింది. ఏ మనసయితే దుర్బలంగా వుండి అతన్ని ప్రాణంగా ప్రేమిస్తున్న భార్యని గూడా, ఆమె పవిత్ర ప్రేమనిగూడ లెక్క చేయకండా తిరస్కరించి బాధించి, చిత్రవధ చేసిందో, ఆ దుర్బల హృదయం యిప్పుడు గట్టిదై, పిచ్చిదై, చచ్చిపోయిన ప్రేమమూర్తికోసం తీరని వ్యథతో బాధ పడుతోంది. లాభమేమిటి?

శోభన, అతని వ్యథని మాన్పి, అతని చితికిపోయిన మనసుని అతికించి, అమృతాన్ని వర్షింపజేయాలని ప్రయాస పడుతోంది. కాని ఆ అమృతాన్ని తాగేందుకతనికి యిష్టం లేదు. అతనిలో ఇష్టాయిష్టాలని కలుగజేసే మనసు చచ్చిపోయింది. స్వామి డబ్బుకి బానిసై, తాగుడుకి వశుడైన దుర్బలుడు - అయినా శోభనకి అతనిమీద అనన్య ప్రేమే!

డాక్టరు వొచ్చాడు కంగారుగా. డాక్టర్ను చూసింది శోభన.

"అన్నయ్యా" అంటూ అతని మీదికి దూకి భోరుమంది.

"ఏడవకమ్మా, సామ్యూల్ బతుకుతాడు" అన్నాడు డాక్టరు ఓదారుస్తున్నట్టు.

"నువ్వు బతికించ లేవన్నాయ్" స్వామి పక్కకి వొచ్చింది శోభన.

"జాగీ! నన్ను నమ్మ, నీ జానకిని నేనే. నువ్వు 'చిట్టీ' అని పిలచేప్పుడు 'జాగీ' అని సమాధానమిచ్చే జానకిని నేనే. జాగీ నన్ను నమ్మవ్? ఈయనే నన్ను బతికించారు. ఆవేళ నువ్వు నన్ను మేడమీదినుంచి తోసేసిన తర్వాత—" అని ఏడుస్తూ అతని ముఖాన్ని తడుముతోంది. డాక్టరు శోభనని ప్రేమగా వారించాడు.

"కాదన్నాయ్, నీ మందులు పనికిరావు. నేను నేనుగా ఋజువు చేసుకొని నా జాగీని బతికించుకుంటాను. జాగీ! కావలిస్తే ఈ ఫొటోలోని నన్నూ సరిగా పరీక్షించి చూడు" ఫొటోకోసం

చూసుకొంది చేతుల్లో లేదు, చీర కుచ్చెళ్లలో లేదు. హృదయంలో గూడా! కంగారుగా వెదకింది... చివరికి దొరికింది. కాని ముఖంమీద వల్లిని మచ్చలు అచ్చుగుద్దినట్టున్నాయి. శోభన ఆ చిత్రాన్ని తీసి, తను చూడకుండానే స్వామికి చూపించింది.

"జాగీ చూడు. ఈ ఫొటో నాదే. ఎనిమిదేళ్ళ క్రితం నువ్వు తీసిన ఫొటోయిది. నాకింకా జ్ఞాపకముంది. ఆ వాళ సాయంకాలం మన చిన్న డాబామీద తీశావు. అప్పుడు అన్నావు నేను చాలా అందకత్తెనని" ఏడుస్తో చెబుతోంది శోభన.

బరువుగా తలతిప్పి, నీరసంగా కళ్ళువిప్పి శోభన చేతిలో వొణుకుతున్న చిత్రాన్ని స్వామి చూశాడు. కళ్ళముందు చక్రాలు గిర గిర తిరిగాయి. ఆ చిత్రం రోజూ తనుచూసే జాగి చిత్రంలా లేదు. ఆ ముఖమే మారిపోయినట్టగుపిస్తోంది. వొణుకుతున్న చేతులని మెల్లగా చాచి శోభన చేతిలోని చిత్రాన్ని తీసుకొని చూశాడు. శోభన ముఖంలోకి చూశాడు-నిలువుగా!

"కాదు శోభనా, నా జాగి అప్పుడే చచ్చిపోయింది-"

"కాదు-కాదు నేనే నీ జానకిని. చిట్టీ అని నువ్వు నన్ను ముద్దుగా పిలిచే వాడివి. ఉద్యోగం లేక నువ్వు వూళ్ళన్నీ తిరుగుతూ, ఇంటికి రాకండా వున్నప్పుడు, మనరాము తిండిలేక జబ్బుపడి చచ్చిపోయాడు. రాము చనిపోయిన మూడు రోజుల వరకూ నువ్వు తిరిగి రాలేదు. మన దారిద్ర్యాన్ని చూసి సహించలేక నువ్వు నోట్లని దొంగతనంగా సృష్టించావు. మనం మరుసటిసంవత్సరంలో నే కోటీశ్వరులమయ్యాం. నువ్వా మిల్లుని కట్టావు. రానురాను నీ దృష్టి డబ్బుమీద ఎక్కువై నన్ను మరచి జాగీ-" పిచ్చికేక వేసింది భయంగా, స్వామి నిలువు చూపు చూడగానే. స్వామి శ్వాసలో నిశ్చలత - దీర్ఘాలోచన వుండి, గతాన్ని జ్ఞప్తికి తెచ్చుకొంటున్నట్టున్నాడు.

స్వామి మూతలు పడిపోతున్న కళ్ళతో శోభనకేసి చూశాడు. ఆశగా స్వామి సమాధానం కోసం నిరీక్షిస్తున్న శోభన దృష్టిని కాదన్నట్టు తలతిప్పి నిరాశ చేశాడు.

"అవును. అవును జాగీ నేనే. నేనే జానకిని శోభనగా మార్చుకొన్నాను. జాగీ... నేనే నమ్మవ్."

"ఇక నమ్మితేమాత్రం ఏముంది శోభనా" అన్నాడు హీనంగా.

"ఇక శోభన అనకు. జాగి ఒక్కసారి "జాగి" అను చాలు."

"అనలేను శోభనా... నువ్వు నా జానకివయినా కాకపోయినా, ఇప్పుడులాభమేమిటి?" తలవాలిపోయింది.

"జాగీ!"— శరీరంమీద కుప్పగా కూలి, చలనంలేని ఆ శరీరాని తడుముతూ, కౌగిలించుకొని ఏడుస్తోంది.

"ఇక ఏడ్చిలాభమేముందమ్మా? లేని విచారాన్ని రెట్టించుకొని, ఆత్మవంచన చేసుకొని, ఎదురుగా వున్నది తన జాగి అయినా, నిరాశతో చనిపోయాడు. అతని మనసు దుర్బలమే అయినా, నిన్ను చంపేశానని నిరాశతో పశ్చాత్తాపపడి జీవితమంతా, జీవచ్ఛవంలాగా గడిపాడు" అన్నాడు డాక్టరు.


"అన్నాయ్... అతన్ని కొత్తవానిగా తయారుచేసి అతనిలో కొత్త ప్రేమని సృష్టించాలనుకొన్నాను."

"నీకు నేను ఈ సంగతి గురించే ఎన్నోసార్లు చెప్పేవాడిని. దురభ్యాసి మనసు దుర్బలమయినదయినా, పెద్దకంపన ఒక్కసారి అకస్మాత్తుగా తగలగానే అదిరి, బెదిరి ఇక అది ఎంత ఘోషిస్తుందో-గతాన్ని స్మరించుకొంటూ. అది నువ్వనుకొనేకంటే ముందుగానే మారి కొత్తదయింది. నువ్వు అతనిలో కొత్తప్రేమని సృష్టించాలనుకున్నావ్, ఇంతకు ముందంతా నీ మీద ప్రేమని ఏవగింపనుకొని! కాని దురభ్యాసికి నిజమయిన ప్రేమ రానురాను పుడుతుంది. అందుకనే నువ్వు అతన్ని ఎంత ఆకర్షించాలని ప్రయత్నించినా, ఆ జానకివి నీవే అయినా, అతనికి ఆ పిచ్చిలో తెలీదు కాబట్టి నిన్ను కొత్తగా ప్రేమించలేక పోయాడు—"

"జాగీ-అవును నాజాగిని నేనే చంపేశాను" ఆ శవాన్ని కౌగిలించుకుంది.

# లిప్టన్స్

## టీ గర్ల్ డస్ట్




## మంచి చిక్కని

## టీ ఒసగును

LTGX 21-TG